ఘనంగా మల్లికార్జునస్వామి జాతర

గొల్లపల్లి: మండలంలోని మల్లన్నపేట శ్రీమల్లికార్జునస్వామి (దొంగమల్లన్న) జాతర బుధవారం ఘనంగా జరిగింది. భక్తులు ఉపవాస దీక్షలతో పట్నాలు వేశారు. బోనాలతో ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. అర్చకులు రాజేందర్ ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. టికెట్ల ద్వారా రూ.40,600 సమకూరినట్లు ఫౌండర్ ట్రస్టీ శాంతయ్య, ఈవో విక్రమ్ తెలిపారు. ఏఎంసీ చైర్‌పర్సన్, మాజీ సర్పంచ్ భీమ సంతోష్, సీఐ రాంనర్సింహారెడ్డి, ఎస్సై సతీశ్ పాల్గొన్నారు.



బోనాలు సమర్పిస్తున్న భక్తులు →

న్యూస్‌రీల్

గోదావరిలో భక్తుల తాకిడి



ధర్మపురిలో భక్తులతో నిండి పోయిన గోదావరి

ధర్మపురి: ధనుర్మాసం, షష్టిమాసం సందర్భంగా ధర్మపురి వద్దగల గోదావరిలో బుధవారం భక్తుల రద్దీ కొనసాగింది. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు మొదట పవిత్ర గోదావరిలో పుణ్యస్నానాలు ఆచరించి స్వామివార్లను దర్శించుకున్నారు.

పెద్దాపూర్ గురుకులం ప్రిన్సిపాల్‌గా మహిపాల్‌రెడ్డి

మెట్‌పల్లిరూరల్: మెట్‌పల్లి మండలం పెద్దాపూర్ గురుకులం పాఠశాల, కళాశాల ప్రిన్సిపాల్‌గా మహిపాల్‌రెడ్డిని నియమిస్తూ.. తెలంగాణ గురుకులాల సొసైటీ కార్యదర్శి రమణకుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. మహిపాల్‌రెడ్డి ఇప్పటివరకు ఇదే గురుకులంలో వైస్ ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు నిర్వర్తించారు. ఇక్కడ పనిచేసిన ప్రిన్సిపాల్ మాధవీలత పాఠశాలకు చెందిన ఓ విద్యార్థి అస్వస్థతకు గురికాగా.. ఆ విషయాన్ని ఉన్నతాధికారులకు తెలియకుండా గోప్యత పాటించడంతో కలెక్టర్ సత్యప్రసాద్ ఆమెను సస్పెండ్ చేసిన విషయం తెల్సిందే. ఆమె స్థానంలో మహిపాల్‌రెడ్డిని నియమించారు.

పంచాయతీల సమస్యల పరిష్కారానికే టోకెన్ సమ్మె

జగిత్యాలరూరల్: గ్రామ పంచాయతీ సమస్యల పరిష్కారానికే టోకెన్ సమ్మె చేస్తున్నట్లు గ్రామ పంచాయతీ ఉద్యోగ కార్మిక సంఘాల జిల్లా జేఏసీ, సీఐటీయూ కన్వీనర్ పుప్పాల శ్రీకాంత్ అన్నారు. బుధవారం జగిత్యాలలో విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయాలని, మల్టీపర్పస్ వర్కర్స్ విధానం అమలు చేయాలని, జీవో నంబరు 51ని సవరించాలని, జీవో 60 ప్రకారం కేటగిరీల వారీగా విధులు నిర్వర్తిస్తున్న వారికి వేతనాలు సవరించాలని, పర్మినెంట్ చేయాలని కోరారు. ట్రెజరీ నుంచి 010 పద్దు ద్వారా చెల్లించాలన్నారు. ఈనెల 27, 28 తేదీల్లో ఎంపీడీవో కార్యాలయాల ఎదుట రెండు రోజుల టోకెన్ సమ్మెకు పిలుపునిచ్చామని, కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. తెలంగాణ గ్రామపంచాయతీ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్ సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు కోమటి చంద్రశేఖర్, జిల్లా కార్యదర్శి పులి మల్లేశం పాల్గొన్నారు.

మున్నూరుకాపుల సంక్షేమానికి కృషి చేయాలి



మండల అధ్యక్షులను సన్మానిస్తున్న చెదలు సత్యనారాయణ

మల్లాపూర్ : మున్నూరుకాపుల సంక్షేమానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేయాలని సంఘం జిల్లా అధ్యక్షుడు చెదలు సత్యనారాయణ అన్నారు. మండల అధ్యక్షుడిగా నియామకమైన తోట సంతోష్‌ను బుధవారం సన్మానించారు. మున్నూరుకాపులు అన్ని రంగాల్లో రాణించాలని, ఐక్యంగా ఉంటూ బలోపేతం కావాలని ఆకాంక్షించారు. రాష్ట్ర ప్రభుత్వం రాజకీయంగా పెద్దపీట వేయాలని, మంత్రివర్గంలో, కార్పొరేషన్ పదవుల్లో అవకాశం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో మెట్‌పల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ కూన గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

వాజ్‌పేయ్ సేవలు మరువలేనివి



వాజ్‌పేయ్ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న నాయకులు

జగిత్యాలటౌన్: మాజీ ప్రధాని, దివంగత అటల్ బిహారి వాజ్‌పేయ్ దేశానికి చేసిన సేవలు మరువలేనివని భారత సురక్షా సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఏసీఎస్.రాజు అన్నారు. వాజ్‌పేయ్ వందో జయంతిని బుధవారం జిల్లా కేంద్రంలోని తహసీల్ చౌరస్తాలో ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. వ్యక్తిగత ప్రయోజనాలు పట్టించుకోకుండా పార్టీ సిద్ధాంతాల కోసం పనిచేసిన గొప్ప నేత అని కొనియాడారు. పుప్పాల సత్యనారాయణ, అక్కినపెల్లి కాశీనాథం పాల్గొన్నారు. బీజేపీ ఆధ్వర్యంలో నాయకులు సిరికొండ రాజన్న, గాదాసు రాజేందర్, పవన్‌సింగ్, సాంబారి కళావతి, దూరిశెట్టి మమత తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా క్రిస్మస్ వేడుకలు



వేడుకలకు హాజరైన క్రైస్తవులు



పెగడపల్లి చర్చిలో కేక్‌కట్ చేస్తున్న విప్ లక్ష్మణ్‌కుమార్



కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే సంజయ్‌కుమార్, చిత్రంలో మున్సిపల్ చైర్‌పర్సన్ జ్యోతి



చిన్నారులకు కేక్ తినిపిస్తున్న జీవన్‌రెడ్డి

జగిత్యాలటౌన్/పెగడపల్లి: జిల్లాలో క్రిస్మస్ వేడుకలు బుధవారం ఘనంగా జరిగాయి. జిల్లాకేంద్రంలోని సీఎస్ఐ వెస్లీ చర్చి, హెబ్రోన్, ఏసురక్తం, ధరూర్ క్యాంపులోని సీఎస్ఐ, ఎఫ్ఎంసీజీఎం చర్చిల్లో క్రైస్తవులు ప్రార్థనలు చేశారు. ఫాస్టైస్ రెవా జీవరత్నం సందేశం వినిపించారు. వేడుకల్లో ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, ఎమ్మెల్యే సంజయ్ పాల్గొన్నారు. పెగడపల్లి, నామాపూర్ చర్చిల్లో పాస్టర్లతో కలిసి ప్రభుత్వ విప్ కట్‌చేశారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రాములు గౌడ్, జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



క్రిస్మస్ వేడుకల్లో కోరుట్ల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్

రీచ్‌లు వద్దు.. అక్రమమే ముద్దు

- అనుమతులు లేకుండానే ఇసుక అమ్మకాలు
- జిల్లావ్యాప్తంగా కొనసాగుతున్న దందా
- ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి
- కొరతతో ఇబ్బంది పడుతున్న ప్రజలు
- రీచ్‌ల ఏర్పాటులో అధికారుల నిర్లక్ష్యంపై విమర్శలు

సాక్షి ఫొటో



మెట్‌పల్లిలో ఓ వాగు నుంచి అక్రమంగా తరలించడానికి సిద్ధంగా ఉంచిన ఇసుక

'ఈ చిత్రంలో కనిపిస్తున్నది మెట్‌పల్లి మండలం ఆత్మకూర్ వాగు నుంచి తీసుకొచ్చి డంప్ చేసిన ఇసుక. ఈ వాగులో ఇసుక రీచ్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు ఇటీవల అధికారులు ప్రకటించారు. కానీ ఇంకా అక్కడ అమ్మకాలను ప్రారంభంలేదు. మరోవైపు ఇదే వాగు నుంచి ఇసుకను అమ్ముకోవడానికి అక్కడి వీడీసీ (గ్రామ అభివృద్ధి కమిటీ) రెండు నెలల క్రితం వేలం నిర్వహించినట్లు తెలిసింది. గతంలో కూడా ఈ గ్రామంలో రీచ్ ఏర్పాటును అడ్డుకున్న వీడీసీ సభ్యులు.. ఆ తర్వాత ఇసుకను అక్రమంగా అమ్ముకున్నారు. ప్రస్తుతం కూడా రీచ్ ఏర్పాటును అడ్డుకోవాలనే ఆలోచనలో వారు ఉన్నట్లు సమాచారం.'

మెట్‌పల్లి: జిల్లాలో ఇసుక అందుబాటులో లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అనుకూలమైన వాగులు, గోదావరి ప్రాంతాలను గుర్తించి అక్కడ ఇసుక రీచ్‌లను ఏర్పాటు చేయాల్సి ఉండగా.. అధికారులు నిర్లక్ష్యం చూపుతున్నారు. కొన్నిచోట్ల ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించినప్పటికీ ఇంకా అక్కడ ఇసుక విక్రయాలను మాత్రం ప్రారంభించడం లేదు. దీంతో అధిక ధరకు ఇసుకను కొనుగోలు చేయాల్సిన పరిస్థితి నెలకొంది.

కేవలం ఐదు చోట్లనే మంజూరు..

- జిల్లాలో 20 మండలాలు ఉన్నాయి. ఇందులో ఇటీవల ఐదుచోట్ల ఇసుక రీచ్‌ల ఏర్పాటుకు ఉన్నతాధికారులు అనుమతి ఇచ్చారు.
- కథలాపూర్ మండలం సిరికొండ, కోరుట్ల మండలం పైడిమడుగు, మెట్‌పల్లి మండలం ఆత్మకూర్, మల్లాపూర్ మండలం సాతారాం, రాయికల్ మండలం ఇటిక్యాలలో రీచ్‌లు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు.
- వీటితోపాటు ధర్మపురి మండలంలో రెండు చోట్ల, బీర్‌పూర్ మండలంలో ఒకచోట ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు.
- మంజూరు చేసిన ఐదు రీచ్‌లలో ఇప్పటివరకు ఎక్కడా కార్యకలాపాలు మొదలుపెట్టకపోవడం గమనార్హం.

అంతటా అక్రమమే..

- జిల్లాలో ఇళ్ల నిర్మాణాలతోపాటు ప్రభుత్వపరంగా అనేక అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయి.
- వీటికి అవసరమైన ఇసుక అందుబాటులో లేకపోవడం ఇబ్బందిగా మారింది.
- దీంతో కొందరు కాళేశ్వరం తదితర ప్రాంతాల్లోని రీచ్‌ల నుంచి లారీల ద్వారా వచ్చే ఇసుకను కొనుగోలు చేస్తుండగా.. ఎక్కువమంది స్థానిక వాగులు, గోదావరి ప్రాంతాల నుంచి అక్రమంగా తరలిస్తున్న ఇసుకను కొనుగోలు చేస్తున్నారు.

వివాదాలకు దారి తీస్తున్న వైనం..

- ఇసుక అక్రమ రవాణా ఎన్నో వివాదాలకు దారి తీస్తోంది.
- చాలాచోట్ల వీటి విషయంలో రాజకీయ నేతల జోక్యం పెరిగిపోయింది.
- ఇసుక అక్రమ తరలింపుపై కఠినంగా వ్యవహరించాలని ఉన్నతాధికారులు ఆదేశాలిస్తే.. స్థానిక నాయకులు అడ్డుకోవద్దంటూ ఒత్తిళ్లకు గురి చేస్తున్నారు.
- మండల స్థాయిలో పోలీస్, రెవెన్యూ అధికారులు ఇబ్బంది ఎదుర్కొంటున్నారు.
- కొన్ని చోట్ల రెండు శాఖలకు చెందిన అధికారులు మామూళ్లు తీసుకుంటూ అక్రమ రవాణాకు సహకరిస్తుండడంపై ఉన్నతాధికారులకు ఫిర్యాదులు వెళ్తున్నాయి.

> జిల్లాలో ఐదు చోట్ల రీచ్‌లను ఏర్పాటు చేశాం. కొన్నికారణాలతో ఇంకా కార్యకలాపాలు మొదలుపెట్టలేదు.
>
> **తొందరలోనే అమ్మకాలు**
>
> తొందరలోనే వాటి వద్ద అమ్మకాలు ప్రారంభిస్తాం. అలాగే మరికొన్ని చోట్ల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నాం.
>
> – జైసింగ్, జిల్లా మైనింగ్ అధికారి

ఎస్సారెస్పీ నుంచి నీటి విడుదల



కాకతీయ కాలువలో పూలు చల్లుతున్న ఎస్సారెస్పీ ఇంజినీర్లు

- పాల్గొన్న రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ అన్వేశ్ రెడ్డి
- కాకతీయ కాలువకు 5,500 క్యూసెక్కుల ప్రవాహం

జగిత్యాలఅగ్రికల్చర్: జిల్లాకు వరప్రదాయిని అయిన శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నుంచి యాసంగి పంటల కోసం కాకతీయ కాలువకు బుధవారం నీటిని విడుదల చేశారు. రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ అన్వేశ్ రెడ్డి, ప్రాజెక్టు పర్యవేక్షక ఇంజినీర్ శ్రీనివాసరావు గుప్తా, కార్యనిర్వాహక ఇంజినీర్ చక్రపాణి, డీఈఈలు రఘుపతి, గణేష్, గంగాభూషణ్, ఏఈలు ప్రాజెక్టు వద్ద పూజలు నిర్వహించారు. కాకతీయ కాలువలో పూలు చల్లారు. తొలుత మూడు వేల క్యూసెక్కులు, సాయంత్రం వరకు 5,500 క్యూసెక్కులకు పెంచారు. సరస్వతి కెనాల్‌కు 300 క్యూసెక్కుల నీటిని నిర్మల్ ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి విడుదల చేశారు. లక్ష్మి కెనాల్‌కు 150 క్యూసెక్కులు విడుదల చేశారు.

ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలి



యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు

జగిత్యాల: ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి వెంకట్ అన్నారు. జిల్లా కేంద్రంలోని టీచర్స్ భవన్‌లో నిర్వహించిన యూనియన్ మహాసభల్లో మాట్లాడారు. గత ప్రభుత్వ పాలనలో విద్య నిర్లక్ష్యానికి గురైందన్నారు. 317 జీవో సవరణతో బాధితులందరికీ న్యాయం జరుగుతుందని, పెండింగ్‌లో ఉన్న డీఏ, వివిధ రకాల బిల్లులు చెల్లించాలని ప్రభుత్వాన్ని కోరారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా తిరుకోవెల శ్యామ్‌సుందర్, ప్రధాన కార్యదర్శిగా అంబటి భూమేశ్వర్, ఉపాధ్యక్షులుగా శ్రీనివాస్, సుశీల, కోశాధికారిగా శ్రీనివాస్, కార్యదర్శులుగా పీవీ.ప్రసాద్, శ్రీధర్, శ్రీనివాస్‌గౌడ్, శ్రీనివాస్‌రావు, స్వర్ణలత, ఆగమయ్య, ఖలీద్‌పాషా, ఎనగందుల గోపి, దాసరి జయంత్‌కుమార్, శ్రీనివాస్, శంకర్, గణేశ్, మహిళా కమిటీ సభ్యులుగా శోభారాణి, స్పోర్ట్స్ కమిటీ కన్వీనర్‌గా రవికుమార్, సాంస్కృతిక కమిటీ సభ్యులుగా దామోదర్ ఎన్నికయ్యారు.

అభివృద్ధి పనులు వెంటనే చేపట్టాలి

- ఎమ్మెల్యే సంజయ్‌కుమార్



ధ్యాన మందిరానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే

జగిత్యాల: జిల్లా కేంద్రంలోని గుట్టరాజేశ్వరస్వామి దేవాలయంలో ధ్యాన మందిరానికి టీటీడీ నుంచి రూ.10 లక్షలు మంజూరు కాగా ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ బుధవారం భూమిపూజ చేశారు. అభివృద్ధి పనులను వెంటనే చేయాలని ఆదేశించా రు. వైస్ చైర్మన్ గోలి శ్రీనివాస్, బాలె శంకర్, అడువాల లక్ష్మణ్, ఆనందరావు, ప్రవీణ్‌రావు పాల్గొన్నారు.

అగ్నిప్రమాద బాధితులకు అండగా ప్రభుత్వం

జగిత్యాలరూరల్: అగ్నిప్రమాద బాధితులకు ప్రభుత్వం అండగా ఉంటుందని ఎమ్మెల్యే అన్నారు. జగిత్యాల రూరల్ మండలం పొలాస గ్రామానికి చెందిన ఎడెల్లి మమత ఇల్లు ప్రమాదవశాత్తు కాలిపోగా బుధవారం పరిశీలించి ప్రభుత్వం నుంచి మంజూరైన రూ.95,100 ఎక్స్‌గ్రేషియా ప్రొసీడింగ్ కాపీని అందజేశారు. బాధితులకు ఇందిరమ్మ పథకంలో ఇల్లు మంజూరు చేస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు సురేశ్, రాంశంకర్, భూమయ్య, నర్సారెడ్డి, రాజు, తిరుపతి, మల్లయ్య పాల్గొన్నారు.

పద్మశాలీ సంఘం రాష్ట్ర కార్యదర్శికి ఎమ్మెల్యే అభినందన

రాయికల్: పద్మశాలీ సంఘం రాష్ట్ర కార్యదర్శిగా మండలంలోని భూపతిపూర్ మాజీ సర్పంచ్ జక్కుల చంద్రశేఖర్ నియామకం కాగా, బుధవారం ఎమ్మెల్యే సంజయ్‌కుమార్‌ను అభినందించారు. పద్మశాలీల అభ్యున్నతికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

నారసింహా యాగం ప్రారంభం



మెట్‌పల్లిరూరల్:మెట్‌పల్లి మండలం వేంపేటలో శ్రీ లక్ష్మి వెంకటేశ్వర స్వామి ఆలయంలో శతచండీ మహాసుదర్శన నారసింహ యాగం ఘనంగా ప్రారంభమైంది.ఈ సందర్భంగా బుధవారం నగర సంకీర్తన,గ్రామ ప్రదక్షణ,ఆలయ ప్రవేశం, యజ్ఞారంభసూచన, ధ్వజారోహణ,గోపూజ, పుణ్యాహవచనం, మృత్రంగ్రహణము, రక్షాబంధనం,అంకురారోపణం,ఋత్విక్‌వరణం పూజ కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.

అటవీప్రాంతంలో ఎస్పీ సైక్లింగ్



బోర్నపల్లి గ్రామానికి సైక్లింగ్ చేస్తున్న జిల్లా ఎస్పీ

రాయికల్: ఎస్పీ అశోక్‌కుమార్ తన కుటుంబ సభ్యులతో కలిసి బుధవారం సరదాగా సైక్లింగ్ చేశారు. మండలంలోని ఒడ్డెలింగాపూర్ నుంచి బోర్నపల్లి అటవీప్రాంతంలో సైక్లింగ్ చేశారు. బోర్నపల్లి శివారులోని బ్రిడ్జిపై ప్రకృతిని ఆస్వాదిస్తూ.. కుటుంబసభ్యులతో ఆహ్లాదంగా గడిపారు. ఎస్పీ స్వయంగా సైకిల్ తొక్కుకుంటూ రావడంతో గ్రామస్తులంతా ఆశ్చర్యానికి గురయ్యారు.

ప్రభుత్వ ఉద్యోగులకు డెప్యూటేషన్

జగిత్యాల: కేజీబీవీ, మోడల్ స్కూల్‌లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు సమ్మె చేస్తున్న నేపథ్యంలో ఆయా పాఠశాలలకు ప్రభుత్వ ఉపాధ్యాయులను డెప్యూటేషన్ పంపించాలని డీఈవో రాము ఎంఈవోలకు ఆదేశాలు జారీ చేశారు. ఎస్ఎస్ఏ ఉద్యోగులు 15 రోజులుగా సమ్మె చేస్తున్న విషయం తెలిసిందే. ప్రస్తుతం పాఠశాలల్లో విద్యార్థులకు బోధన అందకపోవడం, పదో తరగతి పరీక్షలు మరికొద్ది రోజుల్లో ప్రారంభం కానున్న నేపథ్యంలో విద్యార్థుల్లో ఆందోళన మొదలైంది. వారికి నష్టం కలగకుండా ఉండేందుకు ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులను కేజీబీవీ, మోడల్‌స్కూళ్లకు పంపిస్తున్నారు. ఎంఈవోలు పరిశీలించి ఎక్కడెక్కడ ఖాళీలుంటే వారిని పంపించాలని ఆదేశాలు జారీ చేశారు.

కుటుంబంతో కలిసి ఎస్ఎస్ఏల నిరసన



కుటుంబ సభ్యులతో నిరసనలో పాల్గొన్న ఎస్ఎస్ఏ ఉద్యోగులు

జగిత్యాలటౌన్: ఉద్యోగ క్రమబద్ధీకరణ, సమస్యల పరిష్కారం కోరుతూ సమగ్ర శిక్షా అభియాన్ ఉద్యోగులు పిల్లలు, కుటుంబ సభ్యులతో కలిసి నిరసన వ్యక్తం చేశారు. నిరవధిక సమ్మెలో భాగంగా 16వ రోజు బుధవారం ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఎన్నికల్లో ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు తమను పర్మినెంట్ చేసి విద్యాశాఖలో విలీనం చేయాలని కోరారు. జి ల్లా అధ్యక్షుడు బర్ల నారాయణ, ఎస్ఎస్ఏలోని అన్ని విభాగాల ఉద్యోగులు పాల్గొన్నారు.

అర్హులకు ఉద్యోగాలివ్వించండి



హరీశ్‌రావుకు వినతిపత్రం అందజేస్తున్న డీఎస్సీ-2024 అభ్యర్థులు

జగిత్యాల: డీఎస్సీ–2024లో అనర్హులకు హిందీ ఉద్యోగాలు ఇచ్చారని, వెరిఫికేషన్ చేసి అర్హులకు న్యాయం చేసేలా చూడాలని జిల్లాకు చెందిన కొందరు అభ్యర్థులు మాజీమంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావుకు వినతిపత్రం అందించారు. హిందీ ఉపాధ్యాయుల నియమకాల్లో జిల్లాలో అవకతవకలు జరిగాయని, జీవో ఎంఎస్ నంబరు 25 ప్రకారం లాంగ్వేజ్ పండిట్ హిందీ పోస్టుకు డిగ్రీలో హిందీ ఆప్షనల్ సబ్జెక్ట్ లేదా హిందీ ద్వితీయ భాష ఉన్నట్లయితే యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ గుర్తింపు పొందిన వర్సిటీ నుంచి పీజీ హిందీతోపాటు, హిందీ పండిట్ ట్రెనింగ్, బీఈడీ చేస్తే హిందీ మెథడాలజీ ఉండాలని పేర్కొన్నారు. జిల్లాలో ఉద్యోగాలు పొందిన కొందరికి అవి లేవన్నారు. తెలంగాణ స్టేట్ హయ్యర్ ఎడ్యుకేషన్ కమిషన్ ప్రకారం హిందీ విద్వాన్ భూషణ్ మధ్యమ విశారద సర్టిఫికెట్ కోర్సులు డిగ్రీకి సమానం కావన్నారు. అయినప్పటికీ వారికి ఉద్యోగాలిచ్చారని, తద్వారా అర్హులు ఉద్యోగాలు కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. ఖమ్మం జిల్లాలో ఇలాగే జరిగితే అనర్హులను గుర్తించి తొలగించారని, జిల్లాలోనూ రీవెరిఫికేషన్ చేసి అర్హులను నియమించాలని కోరారు. అభ్యర్థులు అన్వర్‌పాషా, ప్రవీణ్, రమేశ్, అతుఫ, రిజ్వాన్, రాజు పాల్గొన్నారు.

క్లుప్తంగా

చెరువులో పడి వృద్ధుడి ఆత్మహత్య

జగిత్యాలక్రైం: జిల్లాకేంద్రంలోని చింతకుంట చెరువులో పడి షేక్ ఇక్బాల్ (58) ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికుల కథనం ప్రకారం.. కామారెడ్డిలోని హనుమాన్‌వాడకు చెందిన షేక్ ఇక్బాల్, సబేర దంపతులకు ఇద్దరు కుమారులు, నలుగురు కుమార్తెలు. చిన్న కుమారుడు జాకీర్ జగిత్యాలలో నివాసం ఉంటాడు. కొద్దిరోజుల క్రితం చిన్న కొడుకు వద్దకు వచ్చి బీట్‌బజార్లో ఉంటున్నాడు. ఈనెల 22న మద్యం తాగేందుకు భార్యను డబ్బులు అడిగాడు. ఆమె తన వద్ద లేవనడంతో కూరగాయలు కోసే కత్తితో సబేర గొంతుకోసి పరారయ్యాడు. సబేరను కుటుంబ సభ్యులు ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించారు. ఆ భయంతో షేక్ ఇక్బాల్ చింతకుంట చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. సబేర ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై మన్మథరావు తెలిపారు.

బావిలో పడి రైతు దుర్మరణం

సారంగాపూర్: బీర్‌పూర్ మండలం కండ్లపల్లిలో ఓ రైతు వరినారుకు నీరు పెట్టడానికి వెళ్లి కాలుజారి బావిలో పడి చనిపోయిన ఘటన బుధవారం చోటు చేసుకుంది. ఏఎస్సై గజేందర్ కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన తిర్రి రాజన్న (65) నారుకు నీరు పెట్టేందుకు పొలానికి వెళ్లాడు. మోటార్ ఆన్‌చేసే క్రమంలో కాలుజారి బావిలో పడిపోయాడు. రాజన్న ఇంటికి రాకపోవడంతో కుటుంబసభ్యులు, గ్రామస్తులు కలిసి పొలం వద్దకు వెళ్లి వెదుకుతుండగా.. బావిలో శవమై కనిపించాడు. రాజన్నకు ఇద్దరు కుమారులు ఉన్నారు. రాజన్న భార్య దేవక్క ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై వెల్లడించారు.

జీడి గింజలతో ముఖంపై దాడి


గాయాలతో ముసిక్

ధర్మపురి: ఏ పనీ చేయక.. ఖాళీగా తిరుగుతూ మద్యం సేవిస్తుండడంతో ఓ వ్యక్తి జీడిగింజలరసం పూయడంతో తీవ్రంగా గాయపడిన సంఘటన ధర్మపురిలో ఆలస్యంగా వెలుగు చూసింది. పోలీసుల కథనం ప్రకారం.. పట్టణంలోని ముస్లింకాలనీకి చెందిన ఖాజాముసిక్ ఆటో డ్రైవర్. కొంతకాలంగా పనులకు వెళ్లకుండా నిత్యం మద్యం తాగుతూ ఇంట్లో భార్యతో గొడవ పడుతున్నాడు. ఈ క్రమంలో ఈనెల 16న తన బావమరిదులు ఎండీ.అలీ, ఎండీ.అమ్జద్ ముసిక్‌ను ఇంటికి తీసుకెళ్లారు. అక్కడ ముసిక్ భార్య ఆసియా అలియాల్ సమీమ్‌తో కలిసి అలీ, అమ్జద్ ముసిక్ ముఖంపై జీడిగింజల రసాన్ని రుద్దారు. దీంతో ఆయన ముఖంపై గాయాలయ్యాయి. దీంతో బాధితుడు బుధవారం పోలీసులను ఆశ్రయించాడు. ఆయన ఫిర్యాదు మేరకు భార్య, బామమరుదులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఉదయ్‌కుమార్ తెలిపారు.

లీజు టెండర్ ప్రకటన

జగిత్యాల పట్టణములో వాసవి గార్డెన్స్ ఫంక్షన్ హాల్ నిర్వహణకు సంబంధించి 5 సంవత్సరముల కాలపరిమితికి గాను ఔత్సాహికుల నుండి రహస్య పద్ధతిన టెండర్‌‌లకు యాజమాన్యము ఆహ్వానిస్తున్నది. సంస్థ నియమ నిబంధనలకు లోబడి టెండరు ఖరారు చేయబడును.

సదరు టెండర్‌లో పొల్గొని ఎక్కువ ధరను సూచిస్తూ, నియమ నిబంధనలకు అంగీకరించిన వారి టెండరు ఖరారు చేయబడును. యాజమాన్యము వారిదే తుది నిర్ణయము.

దరఖాస్తుల విక్రయము తేది: 26-12-2024 నుండి తేది: 28-12-2024 వరకు సీల్డ్ టెండర్ వేయుటకు తేది: 30-12-2024 ఉ॥ 11-00 గం॥ల వరకు. సా॥ 5-00 గం॥లకు హాజరైన సభ్యుల సమక్షములో టెండర్ ప్రతులు తెరువబడును.

పూర్తి వివరములకు: పల్లెర్ల రాజు, అధ్యక్షులు, సెల్: 94406 65544

సాక్షి క్లాసిఫైడ్స్

SERVICES

BUSINESS SERVICES

■ మీ బంగారం మణప్పురం, ముత్తూట్, ఏ ఇతర ఫైనాన్స్‌లో ఉన్న మా డబ్బుతో విడిపించి మార్కెట్ ధరకు కొనబడును. ఫోన్ : 9177555694. [H-783410]

WANTED

■ Universal కంపెనీకి వర్క్ చేయుటకు స్త్రీ/పు కావలెను. జీతం : 15,000 నుండి 20,000 వరకు సంపాదించుకోండి. అడ్రస్ వాట్సాప్ చేయండి. సెల్ : 95027 12418. [M-1256014]

■ త్రివేణి హోంకేర్‌లో వృద్ధులను, పేషెంట్లను చూసుకొనుటకు వర్కర్స్/నర్సులు కావలెను. ఫ్రీ వసతి, ఫుడ్, జీ : 18K. Ph: 9640400073, 9160900024 [SCA24000888]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classifieds, Advertisements Contact: 9951602933 9951602824

జూడోలో సత్తా చాటుతాం

- విజయమే లక్ష్యంగా సాధన చేశామంటున్న క్రీడాకారులు
- రేపటి నుంచి పోటీలు


జూడోలో తలపడుతున్న క్రీడాకారులు

కరీంనగర్‌స్పోర్ట్స్: తెలంగాణ రాష్ట్రంలో జూడో క్రీడకు కేరాఫ్ అడ్రస్‌గా కరీంనగర్ జిల్లా నిలుస్తోంది. ప్రతి సంవత్సరం జిల్లాలో రాష్ట్రస్థాయి జూడో పోటీలు జరగడం ఆనావయితీగా వస్తున్న సంగతి తెలిసిందే. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న సీఎం కప్–2024 క్రీడాపోటీల్లో భాగంగా రాష్ట్రస్థాయి జూడో పోటీలను ప్రభుత్వం కరీంనగర్ జిల్లాకే కేటయించడం విశేషం. దీంతో జిల్లాకు చెందిన క్రీడాకారులు విజయమే లక్ష్యంగా సాధన చేయడం ఆరంభించారు. రేపటి నుంచి మూడు రోజులపాటు కరీంనగర్‌లోని ప్రాంతీయ క్రీడా పాఠశాలలో రాష్ట్రస్థాయి సీఎం కప్ జూడో పోటీలు జరగనున్నాయి. ఈ సందర్భంగా ఉమ్మడి జిల్లా నుంచి ఎంపికైన పలువురు క్రీడాకారుల అభిప్రాయాలు వారి మాటల్లోనే.

చాంపియన్‌గా నిలుస్తా



సీఎం కప్ జూడో పోటీల్లో చాంపియన్‌గా నిలుస్తా. విజయం సాధించాలనే లక్ష్యంతో రోజు హార్డ్ వర్క్ చేశా. 30 కిలోల లోపు విభాగంలో పోటీ పడుతున్నా. చాలా సంతోషంగా ఉంది. గతంలో చాలాసార్లు రాష్ట్ర పోటీల్లో పాల్గొన్నా. రాజస్తాన్‌లో జరిగిన ఎస్జీఎఫ్ఐ జూడో పోటీల్లో పాల్గొన్నా. నాలుగో స్థానం సాధించా.

– ఆర్.కార్తీక్, కరీంనగర్

సంతోషంగా ఉంది



రాష్ట్రస్థాయి జూడో పోటీలకు కరీంనగర్ జిల్లా ఆతిథ్యమివ్వడం సంతోషంగా ఉంది. గతంలో చాలాసార్లు రాష్ట్రస్థాయిలో రజత, కాంస్య పతకాలు సాధించా. స్వర్ణ పతకం సాధించాలనేది లక్ష్యం. 63 కిలోల్లోపు విభాగంలో పాల్గొంటున్నా. తప్పకుండా గెలుస్తానన్న నమ్మకముంది.

– బి.మన్విత, పెద్దపల్లి

బాగా సాధన చేశా



సీఎం కప్ రాష్ట్రస్థాయి పోటీల్లో పతకం సాధించాలనే లక్ష్యంతో రోజు బాగా సాధన చేశా. జిల్లాస్థాయి పోటీల్లో స్వర్ణ పతకం సాధించా. రాష్ట్రస్థాయిలో కూడా సాధిస్తా. రాజస్తాన్‌లో జరిగిన ఎస్జీఎఫ్ఐ జాతీయస్థాయి పోటీల్లో పాల్గొన్నా. ప్రస్తుతం 44 కిలోల్లోపు విభాగంలో పాల్గొంటున్నా.

– డి.వర్షిత, కరీంనగర్

విజయం సాధిస్తా



జూడోలో జాతీయస్థాయిలో చాంపియన్‌గా నిలవాలనేది నా ఆశయం. గతంలో ఎస్జీఎఫ్, జూడో అసోసియేషన్ల ఆధ్వర్యంలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొని రజత, కాంస్య పతకాలు సాధించా. ప్రస్తుతం ఓపెన్ వెయిట్ కేటగిరిలో పాల్గొంటున్నా.

– ఎన్.రోహన్‌నాయక్, సిరిసిల్ల

చాంపియన్‌షిప్ సాధిస్తాం

కరీంనగర్‌లోని ప్రాంతీయ క్రీడా పాఠశాల వేదికగా సీఎం కప్ రాష్ట్రస్థాయి జూడో పోటీలు జరగనున్నాయి. ఉమ్మడి జిల్లా నుంచి పలువురు క్రీడాకారులు పాల్గొంటున్నారు. క్రీడా పాఠశాలకు చెందిన క్రీడాకారులు పెద్ద మొత్తంలో పతకాలు సాధిస్తారనే నమ్మకముంది. చాంపియన్‌షిప్‌ను కూడా కైవసం చేసుకుంటాం.

– కె.శ్యామ్, ఖేలో ఇండియా జూడో సెంటర్ కోచ్, కరీంనగర్


ముస్తాబైన అయ్యప్ప ఆలయం


జాతర కరపత్రం అవిష్కరణ

హరిహరపుత్రనే శరణమయ్యప్ప

- రేపు కోరుట్లలో అయ్యప్ప జాతర
- లక్ష మంది భక్తుల హాజరు
- సౌకర్యాల కల్పనకు సన్నాహాలు
- అన్నదానం కోసం ఏర్పాట్లు


అయ్యప్ప స్వామి ప్రత్యేకాలంకరణ

కోరుట్ల: 'స్వామియే శరణమయ్యప్ప.. హరిహరపుత్రనే శరణమయ్యప్ప'..అనే శరణుఘోషతో నెల రోజులుగా కోరుట్ల అయ్యప్ప ఆలయ పరిసరాలు మార్మోగిపోతున్నాయి. అయ్యప్ప జాతరకు ఆలయం ముస్తాబైంది. ఈ జాతరకు దాదాపు లక్ష మంది వరకు భక్తులు హాజరయ్యే అవకాశం ఉంది. ఈమేరకు ఆలయ కమిట ప్రతినిధులు ఏర్పాట్లు చేశారు.

ఉదయం నుంచి సాయంత్రం దాకా

శుక్రవారం ఉదయం 5 గంటల నుంచి అయ్యప్పస్వామికి సుప్రభాతసేవ, మూల విరాట్టుకు అభిషేకాలు, గణపతిహోమం, దివ్యపదునెట్టాంబడి పడిపూజ, రథోత్సవం కనులపండువగా నిర్వహించనున్నారు. అయ్యప్ప ఆలయ పరిసరాల్లోని అన్నదానం కోసం ఇప్పటికే సుమారు 5 ఎకరాల స్థలంలో పరిసరాలు పరిశుభ్రం చేసి బారికేడ్లు ఏర్పాటు చేశారు. సుమారు వేయి మంది వలంటీర్ల సహకారం తీసుకోనున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు అంబటి శ్రీనివాస్ తెలిపారు. అయ్యప్ప మాలధారులకు, ఇతర భక్తులకు వేర్వేరుగా బిక్ష (అన్నదానం) నిర్వహిస్తున్నట్లు వివరించారు. మహిళలు, పురుషులకు వేర్వేరుగా క్యూలైన్లు ఏర్పాటు చేశారు.

లక్ష మంది వస్తారని అంచనా

ఏటా డిసెంబర్ 27న జరిగే అయ్యప్ప జాతరకు కోరుట్ల, మెట్‌పల్లి, కథలాపూర్, మేడిపల్లి, మల్లాపూర్ మండలాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలివస్తారు. ఈ జాతరలో సుమారు 50వేల మందికి అన్నదానం చేయనున్నారు. ఈ అన్నదానానికి పెద్ద సంఖ్యలో భక్తులు విరాళాలు అందజేస్తున్నట్లు ఆలయ కమిటీ గౌరవ అధ్యక్షుడు చిద్రాల నారాయణ, అధ్యక్షుడు అంబటి శ్రీనివాస్ తెలిపారు. సుమా రు రూ.60లక్షలతో నిర్మించతలపెట్టిన ఆలయ కాంపౌండ్‌కు మాలధారులు సహకరించారని తెలిపారు. ఈనెల 27న జాతరకు భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి అయ్యప్ప స్వామి అనుగ్రహానికి పాత్రులు కావాలని ఆలయ కమిటి నిర్వాహకులు కోరారు.

ఇద్దరు అదృశ్యం


లక్ష్మి

కరీంనగర్‌రూరల్: కరీంనగర్‌రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఇద్దరు అదృశ్యమయ్యారని పోలీసులు తెలిపారు. వారి వివరాల ప్రకారం.. కరీంనగర్ మండలంలోని దుర్శేడ్‌కు చెందిన అంబటి రాజయ్య–లక్ష్మి దంపతులకు నలుగురు కూతుళ్లు, ఒక కుమారుడు ఉన్నారు. రాజయ్య కూలీ పని చేస్తూ జీవనో పాధి పొందుతున్నాడు. లక్ష్మి కొన్ని రోజులుగా అ నారోగ్యంతో బాధ పడుతోంది. ఈ క్రమంలో మంగళవారం ఎవరికీ చెప్పకుండా ఇంటినుంచి వెళ్లిపోయింది. కుటుంబసభ్యులు బంధువుల ఇళ్లతోపాటు చు ట్టుపక్కల వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో బు ధవారం ఆమె భర్త రాజయ్య ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసినట్లు పోలీసులు పేర్కొన్నారు.

గోపాల్‌పూర్‌లో యువకుడు..


గణేశ్

కరీంనగర్ మండలంలోని గోపాల్‌పూర్‌కు చెందిన బెజ్జంకి గణేశ్ అనే యువకుడు మంగళవారం రాత్రి ఇప్పుడే వస్తానంటూ ఇంట్లోవాళ్లకు చెప్పి, బయటకు వెళ్లాడు. తిరిగి రాలేదు. అతని ఫోన్ స్విచ్ ఆఫ్ వస్తుండటంతో కుటుంబసభ్యులు చుట్టుపక్కల వెతికారు. బుధవారం బంధువుల ఇళ్లలో ఆరా తీసినా ఆచూకీ లభించలేదు. దీంతో అతని తల్లి కనకమ్మ పోలీసులకు ఫిర్యాదు చేయగా మిస్సింగ్ కేసు నమోదు చేశారు.

రాష్ట్రస్థాయి యోగా పోటీల్లో ప్రతిభ


విద్యార్థులను అభినందిస్తున్న శ్రీపాల్‌రెడ్డి

కరీంనగర్‌స్పోర్ట్స్: కరీంనగర్‌లో ఇటీవల జరిగిన రాష్ట్రస్థాయి యోగా చాంపియన్‌షిప్ పోటీల్లో మంకమ్మతోటలోని సిద్ధార్థ విద్యాసంస్థలకు చెందిన విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. పాఠశాలకు చెందిన 40 మంది విద్యార్థులు పోటీల్లో పాల్గొనగా.. 15 మంది బంగారు, 12 మంది రజత పతకాలు సాధించారు. విద్యాసంస్థల అధినేత దాసరి శ్రీపాల్‌రెడ్డి, ప్రిన్సిపాళ్లు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు అభినందించారు.

కబడ్డీలో జిల్లా జట్టుకు తృతీయ స్థానం


బాలికల జట్టు

కరీంనగర్‌స్పోర్ట్స్: మేడ్చల్ జిల్లాలోని హకీంపేటలో జరిగిన రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో జిల్లా బాలికల జట్టు సత్తాచాటింది. బాలికలు అద్వితీయ పోరాట పటిమను కనబరిచి తృతీయ స్థానం సాధించారు. జిల్లా బాలికల జట్టు నారాయణపేట జిల్లా జట్టుపై 36–22 స్కోర్ తేడాతో విజయం సాధించి తృతీయ స్థానాన్ని కైవసం చేసుకుంది. జిల్లా కబడ్డీ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ అమిత్‌కుమార్, మల్లేశ్‌గౌడ్, వర్కింగ్ అధ్యక్షుడు సీహెచ్ సంపత్‌రావు, చైర్మన్ ప్రసాద్‌రావు, వైస్ చైర్మన్ అనూకర్‌రావు, కోచ్ పద్మ తదితరులు హర్షం వ్యక్తం చేశారు.



హరహర మహాదేవ



వేములవాడ: వరుసగా సెలవులు రావడంతో రాజన్నను బుధవారం 50వేల మంది భక్తులు దర్శించుకున్నారు. ధర్మగుండంలో పుణ్యస్నానాలాచరించిన భక్తులు స్వామి వారికి అభిషేకాలు, అన్నపూజలు, కల్యాణాలు, సత్యనారాయణవ్రతాలు, కోడెమొక్కులు చెల్లించుకున్నారు. లడ్డూ ప్రసాదాలు కొనుగోలు చేసి తీసుకెళ్లారు. భక్తుల ద్వారా రూ.45లక్షల ఆదాయం వచ్చినట్లు ఆలయ అధికారులు తెలిపారు.

ఆస్తులు కాజేశారు.. అంత్యక్రియలు మరిచారు


వృద్ధురాలి ఇంటి తాళాలు పగులగొడుతున్న స్థానికులు


అంత్యక్రియలు నిర్వహిస్తున్న స్థానికులు

- అంతిమసంస్కారాలు చేసిన స్థానికులు

జగిత్యాలక్రైం: ఆమెకు కన్నబిడ్డలు లేరు. బంధువులు అన్ని చూసుకుంటారని భావించిన ఆమె ఆస్తులు పంచించింది. కానీ.. ఆమె ఆస్తులు తీసుకుని.. తీరా ఆమె చనిపోతే కనీసం అంత్యక్రియలు నిర్వహించేందుకు కూడా నిరాకరించారు. ఆమె మృతదేహాన్ని సుమారు ఆరు గంటల పాటు అంబులెన్స్‌లోనే ఉంచారు. ఈ అమానవీయ ఘటన జిల్లాకేంద్రంలో మంగళవారం రాత్రి చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. పట్టణంలోని తీన్‌ఖని చౌరస్తా ప్రాంతానికి చెందిన సాదుల సత్తమ్మ భర్త 20 ఏళ్ల క్రితం మృతిచెందాడు. వీరికి పిల్లలు లేకపోవడంతో తమ ఆస్తిని బంధువులకు అప్పగించింది సత్తమ్మ. వృద్ధాప్యంతో మంగళవారం ఆమె ఆస్పత్రిలో చనిపోయింది. దీంతో బంధువులు అంబులెన్స్‌లో శవాన్ని ఇంటికి తీసుకొచ్చారు. ఆస్తి తీసుకున్న వారు శవాన్ని ఇంట్లోకి నిరాకరించడంతో రాత్రి 11 గంటల వరకు మృతదేహం అంబులెన్స్‌లో రహదారిపైనే ఉంది. పట్టణ ఎస్సై గీత జోక్యం చేసుకుని వృద్ధురాలి ఇంటి తాళాలు పగులగొట్టి మృతదేహాన్ని అందులో ఉంచారు. బుధవారం ఆమె అంత్యక్రియలకు బంధువులెవరూ రాకపోవడంతో స్థానికులే పూర్తి చేశారు. దీనిపై సుమోటోగా స్వీకరించిన ఎస్సై గీత వృద్ధురాలి బంధువులు సాదుల రవి, సాదుల ప్రసాద్‌పై కేసు నమోదు చేశారు. ఘటనపై పూర్తిస్థాయిలో విచారణ చేపడుతున్నట్లు పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి


రామ నర్సయ్య (ఫైల్)

మల్లాపూర్: మండలకేంద్రం శివారులో బుధవారం రాత్రి రెండు బైక్‌లు ఎదురెదురుగా ఢీకొన్న ఘటనలో ఒకరు మృతి చెందారు. మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల కథనం ప్రకారం మల్లాపూర్‌కు చెందిన రామ నర్సయ్య(38) పాతదాంరాజుపల్లి నుంచి మల్లాపూర్ వైపు స్కూటీపై వస్తున్నాడు. అదే గ్రామానికి చెందిన వేములవాడ నితిన్ ద్విచక్ర వాహనంపై పాతదాంరాజుపల్లి వైపు అతి వేగంగా వెళ్తూ రామ నర్సయ్య స్కూటీని ఢీ కొట్టాడు. ఈ ఘటనలో నర్సయ్య అక్కడికక్కడే మృతి చెందాడు. తీవ్రంగా గాయపడిన నితిన్‌ను ఆసుపత్రికి తరలించారు. రామనర్సయ్యకు భార్య రజిత, ముగ్గురు కూతుళ్లు ఉన్నారు. మల్లాపూర్ ఎస్సై రాజు ఘటనా స్థలికి చేరుకుని విచారణ చేపట్టారు. కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

అప్పుల బాధతో ఒకరి ఆత్మహత్య

వెల్గటూర్ :అప్పుల బాధతో ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన ఎండపల్లి మండలం రాజారాంపల్లిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం .. గ్రామానికి చెందిన గన్నేరువరం చంద్రయ్య (35)పై అదే గ్రామానికి చెందిన ఓ మహిళ 2015లో లైంగిక వేధింపుల కేసు పెట్టింది. ప్రస్తుతం ఆ కేసు ట్రయల్‌కు వచ్చింది. ఆ కేసులో తనకు శిక్ష పడుతుందని భయం ఓ వైపు.. హార్వెస్టర్ సరిగా నడవక అప్పులు పెరిగి తీర్చేమార్గం కానరాక జీవితంపై విరక్తితో ఈనెల 19న క్రిమి సంహారక మందు తాగాడు. కరీంనగర్‌లోని ఓ ప్రై వేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందాడు. చంద్రయ్య భార్య లత ఫిర్యాదు మేర కు కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఉమాసాగర్ తెలిపారు.

డ్రెయినేజీ మ్యాన్‌హోల్‌లో పడ్డ కారు


బస్టాండ్ ఆవరణలోని డ్రెయినేజీ మ్యాన్‌హోల్‌లో ఇరుక్కుపోయిన కారు

ఇల్లంతకుంట: ఇల్లంతకుంట బస్టాండు ఆవరణలో డ్రెయినేజీ మ్యాన్‌హోల్ తెరిచి ఉండడంతో బుధవారం కారు ముందు చక్రం ఇరుక్కుపోయింది. బస్టాండ్‌లోని మ్యాన్‌హోల్ తెరిచి ఉందని వారం క్రితం సాక్షిలో కథనం ప్రచురితమైనా అధికారులు స్పందించలేదు. అధికారులు స్పందించి ఉంటే ఈ ప్రమాదం జరిగి ఉండేది కాదని స్థానికులు చర్చించుకుంటున్నారు. కారు చక్రాన్ని స్థానికులు పైకి లాగారు. ఇప్పటికైనా గ్రామపంచాయతీ అధికారులు స్పందించి మ్యాన్‌హోల్‌ను మూసివేయాలని కోరారు.

పోగొట్టుకున్న బ్యాగు అప్పగింత



బ్యాగు అప్పగిస్తున్న సీఐ కోటేశ్వర్

కరీంనగర్‌క్రైం: ఓ మహిళ పోగొట్టుకున్న బ్యాగును కరీంనగర్ వన్‌టౌన్ పోలీసులు వెతికి, ఆమెకు అప్పగించారు. సీఐ కోటేశ్వర్ వివరాల ప్రకారం.. ఆదిలాబాద్‌కు చెందిన కలికోట మౌనిక బుధవారం తన కుటుంబసభ్యులతో కలిసి బస్సులో కేశవపట్నం వెళ్తోంది. కరీంనగర్ బస్టాండ్‌కు చేరుకున్నాక.. బ్యాగులు ఒకే రకంగా ఉండటంతో మరో ప్రయాణికురాలు మౌనిక బ్యాగును తీసుకెళ్లింది. బాధితురాలు వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేసింది. బ్యాగు తీసుకెళ్లిన మహిళ ఓ ఆటో ఎక్కినట్లు పోలీసులు సీసీ కెమెరాల సహాయంతో గుర్తించారు. ఆటోడ్రైవర్ అహ్మద్‌ఖాన్‌కు ఈ విషయం తెలుపగా అతను సదరు మహిళ ఇంటిని చూపించడంతో బ్యాగు దొరికింది. అందులోని బంగారు, వెండి వస్తువులను పోలీసులు బాధితురాలికి అప్పగించారు. బ్యాగును గుర్తించిన క్రైం పార్టీ పోలీస్ కుమార్, బ్లూకోల్ట్స్ సిబ్బంది అశోక్, ఆటోడ్రైవర్ అహ్మద్ ఖాన్, ఆటో యూనియన్ ప్రెసిడెంట్ వాజిజ్ ఖాన్‌లను సీఐ కోటేశ్వర్ అభినందించారు.

కాలువ నీటితో విద్యుత్ ఉత్పత్తి

- ఎస్సారెస్పీ డీ–83 కాలువపై 10 మినీ హైడల్ ప్రాజెక్టులు
- జెన్‌కో ఆధ్వర్యంలో నిర్వహణ : 56 మందికి ఉపాధి
- గ్రిడ్‌కు అనుసంధానంతో లో వోల్టేజీ సమస్యకు చెక్
- ఉత్పత్తి వ్యయం తక్కువ.. నాణ్యత ఎక్కువ


విద్యుత్‌ను ఉత్పత్తి చేసే టర్బైన్లు, జనరేటర్లు


కుమ్మరికుంట వద్ద డీ–83 కాకతీయ కాలువపై నిర్మించిన మినీ జల విద్యుత్ కేంద్రం

జూలపల్లి(పెద్దపల్లి): ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఆయకట్టుకు సాగునీరు అందించే ఎస్సారెస్పీ డీ–83 కాకతీయ కాలువపై వివిధ చోట్ల ఏర్పాటు చేసిన మినీ హైడల్ ప్రాజెక్టుల ద్వారా రోజూ 9.16 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి అవుతోంది. అంతేకాదు.. వేలాది ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందుతోంది. ఇలా తయారైన కరెంట్‌ను గ్రిడ్‌కు అనుసంధానించడం ద్వారా లో వోల్టేజీ సమస్య కూడా పరిష్కారమవుతోంది.

జెన్‌కో ఆధ్వర్యంలో నిర్వహణ..

శ్రీరాంసాగర్(ఎస్సారెస్పీ) ప్రాజెక్టు డీ – 83 ప్రధాన కాలువ, డీ – 86 కాలువల ద్వారా ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని ఆయకట్టుకు సాగునీరు విడుదల చేస్తున్నారు. ఇందులోని డీ–83పై మినీ హైడల్ ప్రాజెక్టులు నిర్మించగా.. జెన్‌కో ఆధ్వర్యంలో నిర్వహణ చేపట్టారు. ఇది జిల్లాలోని ధర్మారం మండలం నుంచి జూలపల్లి, పెద్దపల్లి వరకు, ఆ తర్వాత సుల్తానాబాద్ తదితర మండలాల్లోని ఆయకట్టుకు సాగునీరు అందిస్తోంది. అయితే, ఎస్సారెస్పీ ద్వారా సాగునీరు విడుదల చేసిన ప్రతీసారి డీ –83 మెయిన్ కెనాల్‌పై నిర్మించిన మినీ హైడల్ ప్రాజెక్టుల్లో రోజూ 9.16 మెగావాట్ల జల విద్యుత్ ఉత్పత్తి అవుతుంది.

పది జలవిద్యుత్ కేంద్రాలు..

శ్రీరాంసాగర్ డీ–83 మెయిన్ కెనాల్‌పై వివిధ చోట్ల పది మినీ హైడల్ కేంద్రాలు నిర్మించారు. వీటికి టర్బైన్లు బిగించారు. జనరేటర్లు ఏర్పాటు చేశారు. నీటి ఉధృతితో టర్బైన్లు తిరుగుతూ జనరేటర్ ద్వారా విద్యుత్ ఉత్పత్తి అవుతుంది. దీనిని ట్రాన్స్‌ఫార్మర్ల ద్వారా 33కేవీ లైన్‌కు అనుసంధాంచి తుర్కలమద్దికుంటలోని సబ్‌స్టేషన్‌కు సరఫరా చేస్తున్నారు. అక్కడి నుంచి డిస్కంలకు పంపిణీ చేస్తున్నారు.

చొప్పదండిలో ప్రారంభం..

కరీంనగర్ జిల్లా చొప్పదండి మండలం రెవెల్లె గ్రామం వద్ద ప్రారంభమయ్యే డి– 83 కాలువపై పలు చోట్ల 10 మినీ హైడల్ విద్యుత్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఇందులో ధర్మారం మండలం కమ్మరిఖాన్‌పేట 6వ మైలురాయి వద్ద 500 కిలోవాట్ల సామర్థ్యం గలవి, ఏడో మైలురాయి అబ్బాపూర్ వద్ద 500 కిలోవాట్లవి, తొమ్మిదో మైలురాయి కుమ్మరికుంట వద్ద 500 కిలోవాట్లవి, పదో మైలురాయి కుమ్మరికుంట వద్ద 220 కిలోవాట్లవి, పన్నెండో మైలురాయి కాచాపూర్ వద్ద 325 కిలోవాట్లవి, 14వ మైలురాయి పెద్దపల్లి మండలం తుర్కలమద్దికుంట వద్ద 500 కిలోవాట్లవి, 16వ మైలురాయి చందపల్లి వద్ద 500 కిలోవాట్ల జల విద్యుత్ కేంద్రాలు ఉన్నాయి.

56 మందికి ఉపాధి..

పది జల విద్యుత్ కేంద్రాల్లో 56 మంది నిరుద్యోగులకు ఉపాధి లభిస్తోంది. ఐటీఐ పూర్తిచేసి అప్రెంటీస్‌లో ఉత్తీర్ణత సాధించిన నిరుద్యోగులను జెన్‌కో అధికారులు ఇక్కడ ఆపరేటర్లుగా నియమించారు.

మినీ జలవిద్యుత్ కేంద్రాలు

మండలం	ప్రాంతం	ప్రాజెక్టులు
పెద్దపల్లి	చందపల్లి	2
పెద్దపల్లి	బొంపల్లి	1
పెద్దపల్లి	తుర్కలమద్దికుంట	2
జూలపల్లి	కాచాపూర్	1
జూలపల్లి	కుమ్మరికుంట	2
జూలపల్లి	అబ్బాపూర్	1
ధర్మారం	కమ్మర్‌ఖాన్‌పేట	1

కాలువలో సామర్థ్యం మేరకు నీటి పారకం ఉన్నసమయంలో ఆపరేటర్లు టర్బైన్లు ఆన్ చేస్తారు. జనరేటర్ల ద్వారా విద్యుత్ ఉత్పత్తి సాఫీగా సాగేలా నిత్యం పర్యవేక్షిస్తుంటారు. అంతేకాదు.. ప్రతీ వేసవిలో టర్బైన్లు, జనరేటర్లను ఓవర్‌హాలింగ్ చేసి.. విద్యుత్ ఉత్పత్తికి సన్నద్ధం చేయడంలో జెన్‌కో అధికారులు వీరికి సాయం చేస్తూ ఉంటారు.

నాణ్యమైన విద్యుత్ ఉత్పత్తి

ఎస్సారెస్పీ డీ– 83 మెయిన్ కాలువలో పూర్తిస్థాయిలో నీటిని విడుదల చేసినప్పుడు టర్బైన్లను ఆన్‌చేసి జనరేటర్ల ద్వారా నాణ్యమైన విద్యుత్ ఉత్పత్తి చేస్తున్నాం. అక్కడి నుంచి సబ్‌స్టేషన్‌కు తరలించి డిస్కంకు సరఫరా చేస్తున్నాం. ఇక్కడ తక్కువ ఖర్చుతో జల విద్యుత్ ఉత్పత్తి చేయడమే మినీ హైడల్ ప్రాజెక్టుల లక్ష్యం.

– నరేశ్, డీఈ, జెన్‌కో